ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
సోమవారం 4 మార్చి 2024



బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా
- పార్టీ మారుతానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం
- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం
- కిడ్నాపర్‌ను అరెస్టు చేసి పాపను రక్షించిన పోలీసులు

7లో



ముదురుతున్న ఎండలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

భిన్నమైన వాతావరణం.. ఇన్‌ఫెక్షన్ల బారిన జనం

మెదక్ అర్బన్, మార్చి 3: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఉక్కపోత మొదలైంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లోని హెచ్చుతగ్గుల ప్రభావంతో జనం ఇక్కట్లు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 38.7 డిగ్రీలు, సదాశివపేటలో 38.3 డిగ్రీలు, నిజాంపేటలో 37.9 డిగ్రీలు, అన్నాసాగర్‌లో 37.8 డిగ్రీలు, పాశమైలారంలో 37.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. సిద్దిపేట జిల్లా లకుడారంలో 38.5డిగ్రీలు, తుక్కాపూర్‌లో 38.3 డిగ్రీలు, సిద్దిపేటలో 38.2 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 38 డిగ్రీలు, మెదక్ జిల్లా కౌడిపల్లిలో 37.7 డిగ్రీలు, శివ్వంపేటలో 37.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మొదటి వారంల్లోనే ఎండలు మండుతుంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రతతో పట్టణాలు, పల్లెల్లో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

రాత్రిపూట చల్లటి గాలులు

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా పరస్పర భిన్నమైన వాతావరణం నెలకొన్నది. పగలంతా ఉక్కపోత వేధిస్తే.. రాత్రి చల్లటి గాలులు వీస్తున్నాయి. ఈ అసమతుల్య వాతావరణం వైరల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాపించేందుకు కారణమవుతున్నది. ఏ ఇంట్లో చూసినా పిల్లలు, పెద్దలు జలుబు, దగ్గు, జ్వరం, తల, గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు.

మాట నిలబెట్టుకుంటాం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

నాలుగు గ్యారంటీలు అమలు చేశాం

- ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
- ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యం
- పోలియో రహిత తెలంగాణనే లక్ష్యం
- వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, మార్చి 3: ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకునే విశ్వసనీయత కాంగ్రెస్ పార్టీకే సొంతమని వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ఏరియా ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే నాలుగింటిని అమలు చేశామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంచడం పూర్తిచేశామని తెలిపారు. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. మిగిలిన ఒక్క హామీని అతి త్వరలోనే అమలు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రతీ చిన్నారికి చుక్కలు వేయించాలి

పోలియో రహిత తెలంగాణనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఐదేళ్ల లోపు ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయడమే ఇందుకు మార్గమని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు వేయించకపోయినా ప్రమాదమేనని అన్నారు. అనంతరం గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్లులను మంత్రి అందజేశారు. ఏరియా ఆసుపత్రికి ఎంఆర్‌ఎఫ్ ఫౌండేషన్ అందజేసిన ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, చైల్డ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ సుధీర, డీసీహెచ్ఎస్ సంగారెడ్డి, డీఐవో శశాంక్ దేశ్‌పాండే, డబ్ల్యూహెచ్‌వో అధికారి సందీప్ పాటిల్, యూనిసెఫ్ కన్సల్టెంట్ రవినాయుడు, జోగిపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేశ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ హన్మాండ్లు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, రేఖాప్రవీణ్, శంకర్, హరికృష్ణాగౌడ్, చందర్, దుర్గేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, మాజీ ఎంపీటీసీ డీజీ వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

నేడు.. రేపు ఇంటింటికీ పోలియో చుక్కల పంపిణీ

మెదక్ అర్బన్, మార్చి 3 : పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు ఆయన పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 73 వేలకు పైగా చిన్నారులు ఉన్నారని, వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని కోరారు. చిన్నారుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చందునాయక్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా సర్వేలైన్ అధికారి నవీన్‌కుమార్, డీఐవో మాధురి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మెదక్ కలెక్టర్



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ కూతురు త్రిష వివాహ విందు వేడుక చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ శివారులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, పట్లోళ్ల సంజీవరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. -పుల్‌కల్

వేతన వెతలు



సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

- ఆరోగ్య మంత్రి ఇలాకాలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు మూడు నెలలుగా అందని వేతనాలు
- 104 ఉద్యోగులదీ అదే దుస్థితి

సంగారెడ్డి అర్బన్, మార్చి 3 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ డాక్టర్లు, ఉద్యోగులు, వైద్య సిబ్బందికి నెలల తరబడి వేతనాలు అందడం లేదు. ప్రతీ నెల సకాలంలో వేతనాలు అందక సిబ్బంది ఎదురుచూపులు తప్పడం లేదు. బడ్జెట్ లేకపోవడంతోనే వేతనాలు విడుదల కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. కారణాలేమైనప్పటికీ కుటుంబ పోషణ భారంగా మారిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, సాక్షాత్తు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇలాకాలో పనిచేసే ఆరోగ్యశాఖ ఉద్యోగులకు వేతనాలు అందకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద పనిచేస్తున్న డాక్టర్లు, ఉద్యోగులు, వైద్య సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఇందులో కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలు వేతనాలు రావాల్సి ఉన్నది. జిల్లావ్యాప్తంగా సుమారు 870 మంది ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, టీబీ, ఆర్‌బీఎస్‌కే ఇలా వివిధ విభాగాల్లో పనిచేసే డాక్టర్ల నుంచి ఆశాలు, ఉద్యోగుల వరకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

104 ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాల్లేవ్

వైద్య ఆరోగ్యశాఖలోని 104 ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు రావడం లేదని ఆ విభాగం ఉద్యోగులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 104 కింద 43 మంది పనిచేస్తున్నారు. వారిలో ఫార్మాసిస్టులు 13 మంది, ఎల్‌టీ-11, డీఈవో-5, డ్రైవర్-8, సెక్యూరిటీ-4, అటెండర్-1, ఎల్‌డీ కంప్యూటర్-1 విధులు నిర్వర్తిస్తున్నారు. 2021లో 104 వాహన సేవలను ప్రభుత్వం నిలిపివేయడంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎన్‌సీడీ క్లినిక్‌లు, డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో సర్దుబాటు చేశారు. కానీ, వారికి ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. జీతాల కోసం ఈ నెల 2న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేశారు. పది రోజుల క్రితం మంత్రి దామోదర్‌ను కలిసినా ఇప్పటి వరకూ జీతాలు విడుదల కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సామూహిక బోనాలు నివేదిస్తున్న భక్తులు

మమ్మేలు మల్లన్నా..



- ఏడోవారం జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- పట్నాలు రచించి, బోనాలు నివేదించి మొక్కులు చెల్లింపు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- భక్తులకు అందుబాటులోకి అభిషేకం లడ్డూ ప్రసాదం

7లో





భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

బల్దియాలో గాడి తప్పిన పాలన

సంగారెడ్డిలో పాలకవర్గ సభ్యుల మధ్య కొరవడిన సమన్వయం

ఆరు నెలలుగా జరగని కౌన్సిల్ సమావేశాలు



సంగారెడ్డి టౌన్, మార్చి 3 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపల్‌లో పాలన గాడి తప్పింది. ప్రజా సమస్యలు పట్టించుకోవాల్సిన పాలకవర్గ సభ్యులు ఏడాది నుంచి గ్రూపు రాజకీయాలతో పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలను గాలికి వదిలేశారనే విమర్శలున్నాయి. పారిశుధ్యం, రోడ్లు, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రతీనెల పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా సభ్యుల మధ్య సమన్వయ లోపం కారణంగా ఆరు నెలలుగా జరగడం లేదు. చివరిసారిగా 2013 ఆగస్టు 23న సంగారెడ్డి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. రెండు నెలల అనంతరం అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, ఎన్నికల నిర్వహణతో సమావేశాలు నిర్వహించడం సాధ్యం కాలేదు. డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం ఒక్కసారి కూడా కౌన్సిల్ సమావేశం జరగలేదు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బల్దియా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేందుకు ఈ నెలలోనే ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉంది. కానీ మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై 7వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. అవిశ్వాస రాజకీయాల్లో బిజీగా ఉన్న కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధి, బడ్జెట్ సమావేశాలపై శ్రద్ధ చూపడం లేదు.

విలీనంపై కలవరం..

భవిష్యత్తుపై మదనం!

హెచ్ఎండీఏ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం దిశగా ప్రభుత్వం కసరత్తు

స్థానిక నాయకులు, ఆశావహుల్లో చర్చనీయాంశం

రాజకీయ భవిష్యత్తుపై అయోమయం

జిన్నారం, మార్చి 3: హెచ్ఎండీఏ పరిధిలోని మున్సిపాలిటీలను విలీనం చేసి గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టడం శివారు మున్సిపాలిటీల్లో కలవరానికి కారణమైంది. అభివృద్ధి కోణంలో స్వాగతిస్తున్న రాజకీయ పార్టీలు, నాయకులు లోపల మాత్రం తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల పేరిట చాలా పదవులు ఉంటాయి. విలీనం జరిగితే జనాభా, విస్తీర్ణం ఆధారంగా ఒకట్రెండు కార్పొరేటర్ పదవులు మాత్రమే దక్కుతాయి. దీంతో ముఖ్యమైన పార్టీల్లో పదవుల కోసం నిరీక్షణలో ఉన్న ఆశావాహులు కలవరపడుతున్నారు. హైదరాబాద్ నగర శివార్లలో హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 30 మున్సిపాలిటీల వరకు ఉన్నాయి. వీటిని విలీనం చేసి గ్రేటర్‌సిటీ కార్పొరేషన్ లేదా నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సీఎం స్థాయిలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఇలా జరిగితే జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ కూడా విలీనమయ్యే అవకాశముంది. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం మున్సిపాలిటీల విలీనం జరిగితే అభివృద్ధితో పాటు పన్నుల తీరులోనూ భారీ మార్పులు జరుగుతాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ, కార్పొరేషన్, మున్సిపల్ వ్యవస్థలో పన్నుల విధానం కొంత భిన్నంగా ఉన్నది. విలీనంతో అన్నిచోట్ల ఒకేవిధమైన అభివృద్ధి, నిధుల మంజూరు, పన్ను వసూళ్లు జరుగుతాయి. ఇక అభివృద్ధిలో కొత్త ఒరవడి కనిపిస్తుంది. నాలుగేళ్ల క్రితం బొల్లారం పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. ఇంతలోనే విలీనం ప్రతిపాదనలు తెరపైకి రావడం కరవరం రేపుతున్నది. గ్రేటర్‌లో విలీనం చేస్తే తమ రాజకీయ భవితవ్యం ఏమిటని మున్సిపల్, సమీప గ్రామాల నాయకుల్లో కలవరం మొదలైంది.

భళా.. హస్తకళా మేళా





హస్తకళా మేళాలో విక్రయిస్తున్న మహిళల ఆభరణాలు, అలంకరణ వస్తువులు

సంగారెడ్డి రూరల్, మార్చి 3 : సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత హస్తకళా మేళాకు విశేష స్పందన లభిస్తున్నది. ఫిబ్రవరి 20న ప్రారంభమైన హస్తకళా మేళా ఈ నెల 24 వరకు కొనసాగనున్నది. 500 రకాల హస్తకళాకృతులు, చేనేత వస్త్రాలు ప్రదర్శనకు ఉంచారు. ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, వరంగల్, వెంకటగిరి, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం చీరలు, బెడ్‌షీట్లు, టవల్స్‌లాంటి వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉండే ధరలకే విక్రయిస్తున్నారు. కొండపల్లి, నిర్మల్ బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, మైసూర్ రోజ్‌వుడ్, సహరన్‌పూర్ వుడ్ కార్వింగ్, వరంగల్ లెదర్ బ్యాగులు, బంజారా ఎంబ్రాయిడరీ, బెంగాల్ జూట్‌బ్యాగులు విక్రయానికి ఉంచారు. మేళాకు మంచి స్పందన వస్తున్నదని కళా భారతి హస్తకళా చేనేత కళాకారుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు తెలిపారు.



మేళాలో కళాకృతులు



కర్రతో తయారు చేసిన ఫోన్

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన 'కాశీనాథ్'



ముస్తాబైన కాశీనాథ్ ఆలయం
ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడు

నారాయణఖేడ్, మార్చి 3: పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయాన్ని శివరాత్రి ఉత్సవాల కోసం ముస్తాబు చేశారు. పట్టణంలోని ఈ ఆలయాన్ని దాదాపు 300 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన భక్తుడు పట్నం పవన్‌కుమార్‌గౌడ్ ఈ ఆలయం ప్రాముఖ్యతను గుర్తించి జీర్ణోద్ధరణకు కృషి చేశాడు. ఆలయాన్ని ఆధునీకరించడమే కాకుండా, 16 ఏళ్ల క్రితం కాశీవిశ్వేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. నాటి నుంచి ఈ ఆలయంలో ప్రతి రోజూ ధూపదీప నైవేద్యాలు నిర్వహించడమే కాకుండా, శివరాత్రి పర్వదినం రోజున రుద్రహోమం, రుద్రాభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగడంతో భక్తుల ఆదరణ పెరిగింది. ఏటా శివరాత్రి సందర్భంగా ఆలయంలో శివభక్తులు మాలధారణతో పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న ఉదయం 6 గంటల నుంచి ఉత్సవ సంకల్పం, గణపతిపూజ, రుద్రాభిషేకం, భేరి పూజా, అఖండ దీప స్థాపనం, రక్షాబంధనం, మంత్ర పుష్పం, సాయంత్రం 5 గంటలకు పురవీధుల్లో పల్లకీ సేవ, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8న ఉదయం 5.30 నుంచి 10 గంటల వరకు సామూహిక గణపతి పూజ, రుద్రాభిషేకాలు, అనంతరం ధర్మదర్శనాలు ఉంటాయి. సాయంత్రం 6 గంటల నుంచి నంది వాహన సేవ, రుద్రాభిషేకాలు, రాత్రి 12.15 గంటలకు మహాహారతి, మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ, కార్యక్రమాలు ఉంటాయి. 9వ తేదీన ఉదయం 9 గంటలకు గణపతిపూజ, శివపార్వతుల కల్యాణం, 11.30 గంటలకు హారతి, కార్యక్రమాలు ఉంటాయని, కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగాపేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ ఛైర్మన్ బొగి హన్మాండ్లు గుప్తా, దేవాదాయశాఖ ఈవో మోహన్‌రెడ్డి కోరారు.

'కుంట కాలువ కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి'

శివ్వంపేట,మార్చి 3: కుంట కాలువను పూడ్చి, కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శభాష్‌పల్లి రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం పలువురు శభాష్‌పల్లి రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని హంసాన్‌కుంటకు వర్షపు నీళ్లు వచ్చే కాలువను పూడ్చి, అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆక్రమణను అడ్డుకుని కాలువను కాపాడాలని రైతులు అధికారులను కోరారు.

నెలలు నిండకముందే జననాలు

- వాతావరణ మార్పుల దుష్ప్రభావం
- బాల్యం నుంచే జబ్బుల బారిన భావితరం
- పెరిగిపోతున్న శ్వాసకోశ సమస్యలు
- మందగిస్తున్న ఎదుగుదల.. తాజా అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏటేటా భూతాపం పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో ప్రతికూల మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల ప్రభావం పుట్టబోయే పిల్లలపై కూడా ఉంటుందని ఒక అధ్యయనంలో తాజాగా వెల్లడైంది. వాతావరణ మార్పుల వల్ల మున్ముందు ప్రపంచవ్యాప్తంగా 60 శాతం జననాలు నెలలు నిండకముందే సంభవించే ప్రమాదం ఉందని ఆ స్టడీ హెచ్చరించింది. పుట్టిన పిల్లల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకుల బృందం ఈ అధ్యయనం జరిపింది. దీంట్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జరిగిన 163 పరిశోధనలను విశ్లేషించారు. తద్వారా, చిన్నారుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏవిధంగా ఉంటుందనే దానిపై అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. ప్రత్యేకించి ఎటువంటి తీవ్ర వాతావరణ మార్పుల వల్ల భావితరాల ఆరోగ్యంపై ఏ రకమైన ప్రభావం ఉంటుందన్నది పరిశీలించారు. పరిశోధనకు నేతృత్వం వహించిన కోరే బ్రాడ్‌షా తాము గుర్తించిన అంశాలను వెల్లడిస్తూ.. 'పిల్లల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం గణనీయంగా ఉంటోందని గుర్తించాం. తీవ్రమైన చలివాతావరణం వల్ల చిన్నారుల్లో శ్వాససంబంధిత సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. కరువు, అధిక వర్షాలు వంటివి చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆస్ట్రేలియాలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో నెలలు నిండకముందే పుట్టే పిల్లల సంఖ్య పెరిగినట్లు గుర్తించాం. పశ్చిమ ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్‌లలో పిల్లల్లో శ్వాససంబంధిత సమస్యలు అధికమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల దక్షిణాఫ్రికాలో చిన్నారుల మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది' అని తెలిపారు. పిల్లలపై వాతావరణ మార్పుల ప్రభావం పేద, సంపన్న దేశాలనే తేడాలనే లేకుండా అన్ని చోట్లా కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరిన్ని దుష్ప్రభావాలు ఉంటాయని, అదొక సామాజిక, ఆర్థిక సమస్యలుగా మారుతుందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలు బ్యాలంలోనే జబ్బుల బారినపడటంతో ఆయా దేశాలపై ఆర్థికభారం పెరుగుతుందని, కుటుంబాలపై, ఆరోగ్య సేవలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రజారోగ్య అభివృద్ధి విధానాలపై దృష్టిసారించాలని, మానవ చర్యలతో సంభవిస్తున్న వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయాలని ఈ అధ్యయనం ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ స్టడీ వివరాలను 'సైన్స్' జర్నల్ ప్రచురించింది.

ఏపీలో జగన్‌కు భారీ ఓటమే!

ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం.. ప్రశాంత్ కిశోర్ జోస్యం

- ప్రజలు అభివృద్ధి కోరతారు..
- యువత ఉద్యోగాలు అడుగుతారు
- ఇతరత్రా ప్రయోజనాలు ఆశించరు
- భవంతిలో బటన్ నొక్కితే ఓట్లు రాలవు
- జగన్‌కూ కేసీఆర్ గతే: ప్రశాంత్ కిశోర్

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ పరాజయం ఎదుర్కోనున్నారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) జోస్యం చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్ క్షీణ దశలో ఉందని, తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పట్టబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు ప్రజలు అభివృద్ధికే ప్రాధాన్యమిస్తారని.. ఉచిత పథకాలకు కాదని స్పష్టం చేశారు. 'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు' అని తేల్చిచెప్పారు. ప్రజలు సమర్థ నిర్వహణను చూస్తారని.. కేవలం వనరుల నిర్వహణను కాదని చెప్పారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ వారి బాగోగులను చూస్తున్నామని భావిస్తే అది పొరపాటని. జగన్ ఇదే చేస్తున్నారని.. తెలంగాణలో కూడా కేసీఆర్ ఇదేచేసి దెబ్బతిన్నారని తెలిపారు.



ఎన్నికల ఫలితాలను ధనబలం మాత్రమే నిర్ణయించగలదని అనుకుంటే.. ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరని స్పష్టం చేశారు. జగన్ భారీ పరాజయం చవిచూడనున్నారని.. ఎందుకంటే.. భవంతిలో కూర్చుని బటన్ నొక్కి నేరుగా డబ్బును జమచేసినంత మాత్రాన ఓట్లు రాలవని తేల్చిచెప్పారు. ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వమూ ఓడిపోదని పునరుద్ఘాటించారు. దక్షిణాదిన రాజకీయాల్లో డబ్బు సంస్కృతి అలవడిందని.. కానీ తీసుకున్న డబ్బు ఆధారంగా ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు. 'ఎందుకంటే ఉత్తర భారతంలో కంటే దక్షిణాదినే జనం ఎక్కువ ప్రభుత్వాలను మార్చేశారు' అని చెప్పారు. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ విజయం తథ్యమని ఆయన అంచనా వేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ వైసీపీకి వ్యూహకర్తగా ఉండి ఆ పార్టీని విజయతీరాలకు చేర్చిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట ఇక ఎవరికీ రాజకీయ వ్యూహకర్తగా పనిచేయనని ప్రకటించి.. బిహార్ రాజకీయాల్లో మార్పు కోసం 'జన్‌సురాజ్' పేరిట పాదయాత్ర చేపట్టారు. అయితే ఆయన ఐ-ప్యాక్ టీం ఇప్పటికీ జగన్‌కు పనిచేస్తోంది. ఆ మధ్య పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా సమావేశమయ్యారు. ఆ పార్టీ తరఫున పనిచేయబోతున్నారని వార్తలు వచ్చినా ఉభయవర్గాలూ వాటిని తోసిపుచ్చాయి.

కదిలిన యంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి)

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఈ భూములను పరిశీలించి సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వే ద్వారా నిర్మాణాలు, భూముల సరిహద్దులు, ఎవరెవరు ఇక్కడ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు? ఎంత భాగం ఇందులో భూదాన భూములున్నాయి? వంటి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సర్వే నంబర్లపై విచారణ జరుపుతున్నామని, అన్ని అంశాలతో కూడిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ భూముల్లో పాగా వేసిన మరికొంత మంది పెద్దల పేర్లు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ధరణి వచ్చిన తరువాత పెద్దలంతా అధికార అండతో ఈ భూములను సొంతం చేసుకున్నట్లు వెల్లడవుతోంది. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో.. భూదాన్ భూములను కొనుగోలు చేసిన వారంతా లోలోన ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా భూదాన భూముల వ్యవహారంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులు సోమవారం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వట్టినాగుపల్లిలో భూమికి సంబంధించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వివరణకు, రికార్డుల్లో ఉన్న వివరాలకు పొంతన కుదరడం లేదు. తాను 2014లో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెబుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో 2021 వరకు ఎందుకు నమోదు కాలేదనే విషయానికి మాత్రం సమాధానం లేదు. రాజేశ్వర్‌రెడ్డితో పాటు అనేక మంది భూముల వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదు. ధరణి పోర్టల్ వచ్చిన తరువాతే వీరందరికీ పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. విచిత్రమేమిటంటే.. 2021 జూన్ 10వ తేదీన అప్పటి కలెక్టర్ ఈ 29.27 ఎకరాల భూదాన భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టగా, అదే ఏడాది ఆగస్టు 24వ తేదీన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సర్వే నంబరు 188/1/2 పేరుతో పట్టాదారు పాస్‌బుక్ జారీ అయింది. ఆయనతోపాటు మిగతా వారికి పాస్‌బుక్ జారీ చేయడం వెనుక పెద్ద తతంగమే నడిపారు. ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా చూపించి ధరణి ద్వారా పాస్‌బుక్‌లు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి విషయాల్లో స్థానిక తహసీల్దార్, మండల సర్వే అధికారుల నివేదిక తీసుకుంటారు. కానీ, ఇక్కడ నేరుగా ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ఇచ్చిన స్కెచ్, భూదాన బోర్డు ఇచ్చిన స్కెచ్ ఆధారంగా పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే అప్పటి వరకు అసలు సబ్‌డివిజన్, ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగినట్లు ఆధారాలు కూడా లేకపోవడం వల్లే రెవెన్యూ అధికారులు పాస్‌బుక్‌లు నిలిపివేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ 22ఏ జాబితాలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. పైగా.. వీరు చూపిస్తున్న భూదాన బోర్డు స్కెచ్‌లో ఎక్కడా సంతకం గానీ, తేదీ గానీ, కనీసం స్టాంప్ గానీ లేకపోవడం గమనార్హం. ధరణి ముసుగులో జరిగిన ఈ బాగోతాలు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగానే బట్టబయలయ్యే అవకాశం ఉంది.

నేను కొన్నది భూదాన భూమి కాదు: పల్లా

వట్టినాగులపల్లి భూదాన భూముల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని, వాటిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అక్కడ ఉన్నది కేవలం 1.10 ఎకరాలు మాత్రమేనని, ఇది కూడా భూదాన భూమి కాదని చెప్పారు. తాను వట్టినాగులపల్లి సర్వే నంబరు 181/1/2లో భూమి కొనుగోలుకుకు ఒప్పందం కుదర్చుకున్నానని, దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకుని 2014లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని పేర్కొన్నారు. ఈ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో కూడా పొందుపరిచానని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా ఉన్నాయని చెప్పారు. వీటిని ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు.

మత్తుమందు ఇచ్చి యువతిపై ఇద్దరి అత్యాచారం

- నగ్నచిత్రాలు ఉన్నాయంటూ వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ వద్ద నగ్న చిత్రాలు ఉన్నాయంటూ.. చెప్పినట్లు వినకపోతే వాటిని బయటపెడతామంటూ ఆ ఇద్దరూ యువతిపై వేధింపులకు దిగారు. ఈక్రమంలోనే ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఏడాది క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికే బదిలీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఎల్బీనగర్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రణవ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో అతడు యువతి కళాశాల దగ్గర వెళ్లి కలిసేవాడు. గతేడాది యువతి కళాశాల వద్దకు వెళ్లిన ప్రణవ్ ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే ఆమెను ఇంటికి తీసుకెళ్లకుండా హోటల్‌కు తీసుకెళ్లి.. తాగునీటిలో మత్తుమందు కలిపిచ్చి స్పృహ కోల్పేయేలా చేశాడు. ఆ తర్వాత మరో యువకుడితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే 2 నెలల క్రితం యువతి కుటుంబం బోరబండకు మకాం మార్చారు. ఈ నేపథ్యంలోనే యువతికి ఆ ఇద్దరు మళ్లీ ఫోన్ చేశారు. తాము చెప్పినట్లు వినాలని.. లేదంటే నగ్నచిత్రాలు బయటపెడతామంటూ వేధింపులకు దిగారు. దీంతో ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి.. వారితో కలసి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మమ్మేలు కొమురెల్లి మల్లన్నా

- ఏడోవారం జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- పట్నాలు రచించి, బోనాల నివేదన
- వీవీఐపీ, ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు



అర్ధమండపంలో మల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు



రాజగోపుర ఆవరణలో భక్తుల సందడి

చేర్యాల, మార్చి 3: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. జయహో...కొమురవెల్లి మల్లన్నా... మమ్మేలు మాయన్నా... జయహో... అంటూ జయజయధ్వానాలు చేసి భక్తులు భక్తితన్మయత్వం చెందారు. తలనీ లాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. బోనం నివేదించి బెల్లం పాయసం నైవేద్యం పెట్టి బస చేసిన ప్రదేశం, గంగిరేగుచెట్టు ప్రాంగణం, ముఖమండపాలలో చెలక, నజరు, ముఖ మండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాకపెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడుమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి దర్శనానికి 3 గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులుపడ్డారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టగా, సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు బందోబస్తు నిర్వహించారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా.. ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే జనరేటర్‌ను ఆన్ చేయకపోవడంతో చీకట్లోనే భక్తులు దర్శనం చేసుకున్నారు.

మల్లన్న భక్తులకు అందుబాటులో అభిషేకం లడ్డూ

చేర్యాల, మార్చి 3: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులకు అభిషేకం లడ్డూ ప్రసాదం ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. రూ.900 చెల్లించి ఆర్జితసేవలు నిర్వహించిన వారితో పాటు రూ.500తో వీవీఐపీ దర్శన టికెట్ తీసుకున్న భక్తులకు ఆదివారం ఆలయవర్గాలు 400 గ్రాముల లడ్డూప్రసాదాన్ని అందించారు. 100 గ్రాముల పరిమాణం లడ్డూ ప్రసాదం కిలో తయారీకి రూ.38, 400 గ్రాముల పరిమాణంగల అభిషేకం లడ్డూ తయారీ కిలోకి ఒక పైసా చొప్పున లేబర్ చార్జీల చెల్లిస్తుండటంతో కాంట్రాక్టర్ అభిషేకం లడ్డూలకు బదులు 100గ్రాముల లడ్డూలు అందిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నా ఆలయవర్గాలు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో మల్లన్న భక్తులకు అందని లభిషేకం లడ్డూ' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆలయాధికారులు అభిషేకం లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించారు. వీవీఐపీ దర్శనం, ఆర్జితసేవలు నిర్వహించిన భక్తులకు ఉచితంగా అందించడంతో పాటు ప్రసాద కౌంటర్లలో విక్రయానికి చర్యలు తీసుకున్నారు. లడ్డూ ప్రసాద తయారీ లేబర్ చార్జీల చెల్లింపుల్లో కొన్నినెలలుగా కొనసాగుతున్న అవకతవకలపైనా విచారణ చేపట్టాలని భక్తులు కోరారు.



లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా

- పార్టీ మారుతానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం
- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 3: తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, కాంగ్రెస్‌లో చేరుతానంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మంత్రులు తనను అన్నివిధాలుగా ఆదుకున్నారని, అలాంటి పార్టీని వదిలి వేరే పార్టీలో చేరుతానంటు వస్తున్న ప్రచారాలు సరికాదన్నారు. కొందరు పనిగట్టుకుని లేనిపోని ప్రచారాలు చేస్తూ ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారికి దూరంగా ఉండాలన్నారు. తానైతే బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ పార్టీ పటిష్టత, జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎవరో చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదనే విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. ప్రచారం చేసేవారు ముందుకు వచ్చి తనను ప్రశ్నిస్తే సమాధానం ఇస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత హయాంలో జహీరాబాద్ ప్రాంతం అన్నిరంగాల్లో ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాలం గడిచే కొద్ది, జనాభా పెరుగుతున్న కొద్ది సమస్యలు పెరుగుతుంటాయని, ప్రజల సహకారంతో వాటన్నింటిని అంచలంచెలుగా పరిష్కరించుకుందామని చెప్పారు. జహీరాబాద్ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

- కిడ్నాపర్‌ను అరెస్టు చేసి పాపను రక్షించిన పోలీసులు



కిడ్నాప్‌కు గురైన పాపను కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు

జహీరాబాద్, మార్చి 3: హైదరాబాద్‌లోని మాదన్నపేట పరిధిలో నుస్రత్‌షాజాహాన్‌బేగం అనే మహిళ 8 నెలల చిన్నారిని కిడ్నాప్‌చేసి శనివారం రాత్రి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో జహీరాబాద్‌లో పట్టుకున్నామని పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మాదన్నపేట ప్రాంతానికి చెందిన అమర్యాసిద్దిఖ్(8 నెలలు)ను నుస్రత్‌షాజాహాన్‌బేగం అనే మహిళ హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు కర్ణాటక బస్సులో తీసుకుపోతున్నది. ఈ విషయాన్ని అక్కడి పోలీసులు తమకు సమాచారం ఇవ్వడంతో కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన బస్సులను తనిఖీలు చేయగా నుస్రత్‌షాజాహాన్‌బేగం పాపతో కలిసి పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఆమెను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు, మాదన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. వెంటనే వారు పాప తల్లిదండ్రులతో వచ్చారని ఆయన చెప్పారు. ఈ మేరకు పాపను, నేరస్థురాలిని మాదన్నపేట పోలీసులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన బైక్, ఇద్దరికి గాయాలు

టేక్మాల్, మార్చి 3: హోటల్‌లోకి బైక్ దూసుకెళ్లి ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్ చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన ఇరువురు నార్సింగి నుంచి బోడ్మట్‌పల్లి వైపు బైక్‌పై అతివేగంగా వెళ్తూ టేక్మాల్ చౌరస్తా పక్కన ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హోటల్‌లోని టేబుల్స్ ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు.

తూప్రాన్‌లో 50 వాహనాలు సీజ్

తూప్రాన్, మార్చి 3: తూప్రాన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం ఎస్ఐ శివానందం వాహన తనిఖీలు చేపట్టారు. నంబర్లు ప్లేట్లు లేని వాహనాలు, సరైన పత్రాలు లేకుండా ఉపయోగిస్తున్న 50 వాహనాలు సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. నంబరు ప్లేట్లు, సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ లక్ష్మి, జానీబాష పాల్గొన్నారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, మార్చి 3: ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,7,8వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి జిల్లాలో 14 కేంద్రాల్లో 3,391 మందికి 3,079 మంది హాజరుకాగా, 312 మంది గైర్హాజరయ్యారు. మెదక్ జిల్లాలో 10 కేంద్రాల్లో 2,326 మందికి 2,127 మంది హాజరుకాగా, 199 మంది గైర్హాజరయ్యారు. సిద్దిపేట జిల్లాలో ఆరు కేంద్రాల్లో 1,480 మందికి 1,303 మంది హాజరుకాగా, 177 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో 7,197 మందికి 6,509 మంది హాజరుకాగా, 688 మంది గైర్హారయ్యారు. సంగారెడ్డిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని రీజినల్ కో ఆర్డినేటర్ ప్రభాకర్ తనిఖీ చేశారు.



సంగారెడ్డిలోని బీసీ గురుకుల పాఠశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

వైభవంగా బోనాలు

మెదక్ అర్బన్, మార్చి3: రేణుకా ఎల్లమ్మ 30వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలైన నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, గట్టమ్మ, బోరంచమ్మ అమ్మవార్లకు ఘనంగా బోనాలు తీశారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఉన్న మహిళలు డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాల నడుమ వైభవంగా బోనాలు ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం రేణుకాఎల్లమ్మ తల్లికి బోనాల ఊరేగింపు, ఒడిబియ్యం సమర్పణ, కల్యాణంతో పాటు ప్రత్యేక పూజలు జరగనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది కృష్ణాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు గడ్డమీది యశోద, ఆరెళ్ల గాయత్రి, దొంతి లక్ష్మి, లక్ష్మీనారాయణగౌడ్, మమత, ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌గౌడ్, సంఘ సభ్యులు నారాగౌడ్, మంగ్రశ్రావణ్‌గౌడ్, శంకర్‌గౌడ్, కృష్ణగౌడ్, శరత్‌గౌడ్, రాజాగౌడ్, సంతోష్‌గౌడ్, అరవింద్‌గౌడ్, మోహన్‌గౌడ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● మెదక్‌లో 94.4, సంగారెడ్డిలో 97.6 శాతం నమోదు

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు రెండు చుక్కల మందును వేశారు. మెదక్ జిల్లాలో 94.4 శాతం పల్స్ పోలియో కార్యక్రమం పూర్తయినట్లు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో 97.6 శాతం నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. నేడు, రేపు ఇంటింటికీ తిరిగి చుక్కల మందు వేయనున్నారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. మెదక్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. సంగారెడ్డిలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శశాంక్ దేశ్‌పాండే ప్రారంభించారు. నారాయణఖేడ్ పట్టణంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన మనువరాలికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సంగారెడ్డి రెవెన్యూ కాలనీలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న వైద్యాధికారి ప్రేమవృతం


గుమ్మడిదలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ ప్రవీణ, జడ్పీటీసీ కుమార్‌గౌడ్


పటాన్‌చెరులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


జిన్నారం మండలం శివనగర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్


మాసాయిపేట మండల కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం


హవేళీఘణపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న తహసీల్దార్ నారాయణ


వెల్దుర్తిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు


నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద చిన్నారికి చుక్కల మందు వేస్తున్న చైర్మన్


పెద్దశంకరంపేటలో పోలియో చుక్కలు వేస్తున్న మండల వైద్యాధికారి వేదశ్రీ


మునిపల్లి మండలం ఖమ్మంపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ మీనాక్షి


జహీరాబాద్: గోపన్‌పల్లిలో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న వైద్యసిబ్బంది


టేక్మాల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న తహసీల్దార్ కృష్ణ


కల్హేర్ మండలం క్రిష్టాపూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ నర్సింహారెడ్డి


హత్నూర: చింతల్‌చెరువులో పోలియో చుక్కలు వేస్తున్న తహసీల్దార్ ఫర్హీన్ షేక్


చిన్నశంకరంపేట: జంగరాయిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి


రామాయంపేటలో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్, వైద్యాధికారిణి హరిప్రియ


నిజాంపేట మండల కేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం


పుల్కల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసచారి

15 రోజుల్లో నలుగురు తహసీల్దార్ల బదిలీ

కల్హేర్, మార్చి 3: కల్హేర్ మండల తహసీల్దార్లుగా గత 15 రోజుల్లో నలుగురు వ్యవహరించడం విస్మయాన్ని కలుగజేస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా యంత్రాంగం తహసీల్దార్ల బదిలీలు చేపట్టింది. కల్హేర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బాలాశంకర్‌ను ఫిబ్రవరి 15న కోహీర్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో నిజాంపేట తహసీల్దార్ రాజాగణేష్‌కు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత రెండు రోజులకే రాజాగణేష్‌ను తప్పిస్తూ కంగ్టి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న జుబేర్ అహ్మద్‌ను కల్హేర్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. వారం రోజుల అనంతరం అయనను కూడా తప్పిస్తూ శనివారం వెంకటేశ్వర్లును రెగ్యులర్ తహసీల్దార్‌గా నియమించారు. ఇలా కేవలం 15 రోజుల్లోనే నలుగురు తహసీల్దార్లను మార్చడంతో కల్హేర్ మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

పెద్దశంకరంపేట, మార్చి 3: పటాన్‌చెరులో ఈ నెల 5న నిర్వహిస్తున్న ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ కోరారు. ఆదివారం పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు చేస్తారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ 370కి పైగా స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, సంగమేశ్వర్, బుగుడాల కృష్ణ పాల్గొన్నారు.

బిల్లులు రాక నిలిచిన నిర్మాణం


పాంబండలో అసంపూర్తిగా నిలిచిపోయిన డైనింగ్ హాల్ నిర్మాణం

శివ్వంపేట, మార్చి 3: మండల పరిధిలోని పాంబండ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.15లక్షలు కేటాయించారు. నిర్మాణ పనులు చివరి స్థాయికి చేరుకున్న తర్వాత కేవలం రూ.2.50లక్షలు మాత్రమే బిల్లులు విడుదలయ్యాయి. దీంతో సబ్ కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. ఐదు నెలలుగా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అధికారులు స్పందించి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

2.19కిలోల ఎండు గంజాయి పట్టివేత


ఎక్సైజ్ అధికారుల అదుపులో గంజాయి, నిందితుడు

మునిపల్లి, మార్చి 3: మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు 2.19కిలోల ఎండు గంజాయిని శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సంగాడ్డి సీఐ నజీర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా.. ద్విచక్ర వాహనంపై జహీరాబాద్ నుంచి సంగారెడ్డికి వెళ్తున్న బురుజు జగన్‌ను తనిఖీ చేయగా.. 2.19కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ నజీర్ పాషా తెలిపారు. తనిఖీలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


మెదక్‌లో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

మెదక్ అర్బన్, మార్చి 3: మెదక్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, గట్టమ్మ, బోరంచమ్మ అమ్మవార్లకు ఘనంగా బోనాలు తీశారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాల నడుమ వైభవంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డమీది కృష్ణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు గడ్డమీది యశోద, ఆరెళ్ల గాయత్రి, దొంతి లక్ష్మి, లక్ష్మీనారాయణగౌడ్, మమత, ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌గౌడ్, సంఘ సభ్యులు నారాగౌడ్, మంగశ్రావణ్‌గౌడ్, శంకర్‌గౌడ్, కృష్ణగౌడ్, శరత్‌గౌడ్, రాజాగౌడ్, సంతోష్‌గౌడ్, అరవింద్‌గౌడ్, మోహన్‌గౌడ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో

మనోహరాబాద్: మనోహరాబాద్ మండల కేంద్రంలో ఆదివారం మహంకాళి, ముత్యాలమ్మ, బొడ్రాయి ఉత్సవాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమాంతరావు, నర్సారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ లతవెంకట్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణరెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, యాదగిరిగౌడ్, నాగరాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, నరెన్, గణేష్, నర్సింహగౌడ్, జావిద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నారాయణఖేడ్, మార్చి 3: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ నాయకుడు చిరంజీవి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులు నాలుగున్నర దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడమే కాకుండా ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ పనులు మాత్రమే చేయించాలని కోరారు.

కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక

సంగారెడ్డి రూరల్, మార్చి 3: కేవీపీఎస్ జిల్లా కమిటీని కేవల్ కిషన్ భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శులుగా దాస్, మల్లేశం ఎన్నికయ్యారు.

రూ.2లక్షల ఆర్థిక సహాయం అందజేత

జహీరాబాద్: మండలంలోని దిడిగి గ్రామానికి చెందిన సొన్నాయిల ప్రశాంత్‌తో పాటు భార్య, పిల్లలు రెండురోజుల క్రితం బస్సు ఢీకొనడంతో గాయపడి, హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరుతూ.. వైద్యఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంకింద రూ.2 లక్షలను అందజేశారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకుడు గొల్లభాస్కర్ ఉన్నారు.

ఎంపీ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వండి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 3: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత బీరయ్య యాదవ్ కోరారు. ఆదివారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి జిల్లాలో బీసీ నేతగా గుర్తింపు కలిగిన తనకు మద్దతు ఇవ్వాలని కోరగా.. ఆమె సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు బీరయ్య యాదవ్ తెలిపారు.

సేవా రత్న అవార్డు అందుకున్న పిల్లుట్ల స్వామి

శివ్వంపేట, మార్చి 3: శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్కలకు చెందిన పిల్లుట్ల స్వామి జాతీయ సేవా రత్న అవార్డును ఆదివారం అందుకున్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, పలు రంగాల్లో సేవలు అందిస్తున్నందుకు ఈ అవార్డు వచ్చిందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ, మాజీ ఎంపీ సుగుణకుమారి, ప్రొఫెసర్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి అవార్డును అందుకున్నారు.

హద్నూర్ సీఐగా నయీముద్దీన్

న్యాల్‌కల్, మార్చి 3: హద్నూర్ సీఐగా నయీముద్దీన్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జహీరాబాద్ రూరల్(హద్నూర్) సీఐగా నియమితులైన నవీన్‌కుమార్ హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బొల్లారం సీఐగా పని చేసిన నయీముద్దీన్‌ను జహీరాబాద్ రూరల్(హద్నూర్) సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా.. ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సంగారెడ్డి రూరల్, మార్చి 3: సంగారెడ్డిలోని క్యారీ బాప్టిస్ట్ 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్నానాటి గురుతులను నెమరువేసకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

శివ్వంపేట, మార్చి 3: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీవో వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. నెలరోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు 18 నుంచి 45ఏళ్లలోపు మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రేషన్‌కార్డు జిరాక్సు, ఆధార్ కార్డు జిరాక్సు, పదోతరగతి జిరాక్సు మెమో, నాలుగు పాస్‌పోర్టు ఫొటోలతో 9704446956, 9490129839 నంబర్లలో సంప్రదించాలని ఏపీవో సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం

నారాయణఖేడ్, మార్చి 3: క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లానాయకులు సాగర్‌షెట్కార్ అన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోని పంచాయతీల కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఖేడ్ అనురాధ కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. విజేతలకు శివచంద్ర స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరావు షెట్కార్, శివమాలిపటేల్, నగేష్‌చారి, సాయిదిగ్వాల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

నారాయణఖేడ్, మార్చి 3: జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో నాగల్‌గిద్ద మండలం గొందేగామ గ్రామానికి చెందిన గణేష్ ఆదివారం బీఆర్ఎస్ నుండి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీబీపాటిల్ ఆయనకు బీజేపీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, నాగల్‌గిద్ద మండల అధ్యక్షులు రాజశేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు పత్రి రామకృష్ణ, గుణవంత్‌రావు పాటిల్, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ లయన్స్ క్లబ్‌కు అవార్డు

నర్సాపూర్, మార్చి 3: స్నేహబంధు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సాపూర్‌కు అవార్డులు దక్కాయని క్లబ్ అధ్యక్షుడు నల్లగండ్ల అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నర్సాపూర్ క్లబ్ నిర్వహిస్తున్న కంటి ఆస్పత్రితో పాటు కుట్టుమిషన్ శిక్షణ తదితర కార్యక్రమాలకు అవార్డులు దక్కాయని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రీజియన్ కాన్ఫరెన్సులో అవార్డులను అందుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, క్లబ్ ప్రతినిధులు రాఘవేందర్‌రావు, కొండా శ్రీకాంత్, జైపాల్, బుచ్చేస్ యాదవ్, కిష్టయ్య, రాము, నర్సింగ్‌రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గురించి ఆలోచించని కాంగ్రెస్ ప్రభుత్వం

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, మార్చి 3: ప్రజల గురించి ఆలోచించని కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ పార్టీని ప్రజల్లో అభాసుపాలు చేయడానికి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. ఆదివారం నర్సాపూర్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కలిగే ప్రయోజనం రైతులకు తెలుసునని కానీ ఎలాంటి ప్రయోజనం లేదని నిరూపించేందుకు కాంగ్రెస్ పడరాని పాట్లు పడుతున్నదన్నారు. వర్షాకాలం వచ్చేలోపు మేడిగడ్డ మరమ్మతులు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయడం మానేసి రాజకీయ కక్షలకు పాల్పడడం తగదన్నారు. ఆరుగ్యారంటీల లబ్ధిదారులను తగ్గించేందుకు లేనిపోని నిబంధనలు పెడుతున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ కాలంలోనే ప్రజల అసంతృప్తికి గురవుతుందని సునీతారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీముద్దీన్, నాయకులు చంద్రాగౌడ్, లలిత, బాల్‌రెడ్డి, సురారం నర్సింహులు, రామచందర్, అంజనేయులుగౌడ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ బిల్లులు అందజేత

పెద్దశంకరంపేట, మార్చి 3: పెద్దశంకరంపేటలో గృహ జ్యోతి జీరో బిల్లు పథకాన్ని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల అమలు గురించి వివరించారు. అనంతరం మండల పరిధిలోని రామోజీపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధుసూదన్, మాజీ సర్పంచ్‌లు అలుగుల సత్యనారాయణ, అంజిరెడ్డి, ఎంపీటీసీ రాజునాయక్, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, నాయకులు రాజేందర్‌గౌడ్, సంతోష్‌కుమార్, దాచ సంగమేశ్వర్, పెరుమాండ్ల గౌడ్, సాయిరెడ్డి, చందర్,అశోక్, సంగమేశ్వర్, జైపాల్ గౌడ్ బానుగౌడ్, మహిపాల్‌గౌడ్, మహేష్‌గౌడ్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.


పెద్దశంకరంపేటలో గృహజ్యోతి పథకం గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

● నిజాంపేట: మండల కేంద్రంలో వినియోగదారులకు జీరో బిల్లులను ఏఈ గణేష్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్, మారుతి, నసీరుద్దీన్, వెంకటేష్ గౌడ్, భూమగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● రేగోడు: కొండాపూర్‌లో వినియోగదారులకు జీరో బిల్లులను ఏఈ యాసిన్ అందజేశారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం

రేగోడు మార్చి 3: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలకు మంజూరైన సీసీరోడ్లకు ఇటీవలే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఆదివారం రేగోడు మండలంలోని కొండాపూర్, మర్పల్లి గ్రామాల్లో సీసీరోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కొండాపూర్ మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దశరథ్‌నాయక్, మర్పల్లి భద్రారెడ్డి, సంగమేశ్వర్, జనార్ధన్, కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మర్పల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

సుందరీకరించారు.. నిర్వహణను మరిచారు

● రాయరావు చెరువుపై ధ్వంసమైన బెంచీలు

● దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

నర్సాపూర్, మార్చి 3: రూ.లక్షలు వెచ్చించి నర్సాపూర్ రాయరావు చెరువు కట్టను సుందరీకరించినా పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారింది. ఎత్తైన గుట్టల మధ్యలో ఉండే రాయరావు చెరువును చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి, హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో కట్టను సుందరీకరించింది. కట్టపై ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల వరకు నిర్వహణ బాగానే ఉన్నా ఆ తర్వాత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో కట్టపై ఏర్పాటు చేసిన బెంచీలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. వాకింగ్ ట్రాక్ కూడా దెబ్బతింది. రెండేళ్ల క్రితం కట్టపైనే 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైలాన్ బోసిపోయింది. పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు కట్టపైనే మద్యం సేవిస్తున్నారు.


బోసిపోయిన 75వ స్వాతంత్ర్య దినోత్సవ పైలాన్



ధ్వంసమైన బెంచీ, దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

ప్రత్యేక దృష్టి సారిస్తాం

నర్సాపూర్ రాయరావు చెరువును అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తాం. త్వరలోనే కట్టను అన్ని విధాల మరింత సుందరంగా తీర్చిదిద్ది ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

అసాంఘిక శక్తుల ఆటలు సాగనీయం



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ భాస్కర్

హత్నూర, మార్చి 3: దేశ విభజనకు కుట్రలు చేస్తున్న అసాంఘిక శక్తుల ఆటలను సాగనివ్వబోమని ఆర్ఎస్ఎస్ తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల క్షేత్ర ప్రచార ప్రముఖ్ గొట్టిముక్కుల భాస్కర్ అన్నారు. హత్నూర గ్రామ శివారులో ఆదివారం ఈశ్వరపురం కండ శాఖ సంఘీ కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. సర్వమత సామరస్యం కోసం ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని తెలిపారు. సంఘంలో ఎలాంటి కుల, మత విభేదాలు ఉండవని, భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ వడ్డేటి భూమేష్, జిల్లా శారీరక్ ప్రముఖ్ రామంతపురం విష్ణువర్ధన్‌రెడ్డి, సహ శారీరక్ ప్రముఖ్ జక్కుల శివకుమార్, జిల్లా సంపర్క ప్రముఖ్ కాసుల రవీంద్రనాథ్‌శర్మ, ఈశ్వరపురం ఖండ కార్యవాహ పట్నం హనుమంతు, సహ కార్యవాహ మేకల సురేష్, వెంకటేశం పాల్గొన్నారు.